ప్రజాశక్తి
గురువారం 15 ఆగస్టు 2024
5
శ్రీకాకుళం



వికలాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ 'స్వాభిమాన్'


ప్రజాశక్తి - శ్రీకాకుళం

వికలాంగుల కోసం ప్రతి నెల మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్)ను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సలహా మేరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 16న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కలెక్టరేట్ ఆవరణలోని గ్రీవెన్స్ హాల్‌లో వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వికలాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

స్వాతంత్ర్య సంగ్రామంలో సిక్కోలు

- సైమన్ కమిషన్ గో బ్యాక్ తీర్మానం చేసిన ఏకైక శ్రీకాకుళం మున్సిపల్ పాలకవర్గం
- ఉప్పు సత్యాగ్రహం పిలుపునకు జిల్లాలో పెద్దఎత్తున స్పందన
- ఉద్యమానికి ఊపునిచ్చిన గరిమెళ్ల 'మాకొద్దీ తెల్లదొరతనం' పాట

అనేక ఉద్యమాలకు ఖిల్లా అయిన శ్రీకాకుళం జిల్లా స్వాతంత్ర్య ఉద్యమంలోనూ కీలకపాత్ర పోషించింది. 1921లో సహాయ నిరాకరణ నుంచి ఉద్యమం దగ్గర నుంచి 1947లో స్వాతంత్ర్యం వచ్చే వరకూ ఎన్నో ఉద్యమాల్లో ఈ జిల్లావాసులు భాగస్వాములై, జైలు జీవితాన్ని అనుభవించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వాతంత్రోద్యమంలో శ్రీకాకుళం జిల్లా పాత్రపై 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం...



ప్రజాశక్తి - శ్రీకాకుళం

1915లో దక్షిణాఫ్రికా నుంచి మహాత్మాగాంధీ భారతదేశానికి వచ్చిన తర్వాత, దేశమంతా పర్యటించిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణ ఉద్యమానికి జాతీయ కాంగ్రెస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన చట్టి పూర్ణయ్య పంతులు, ఇచ్ఛాపురానికి చెందిన పుల్లెల శ్యామసుందర్, పాతపట్నానికి దుక్క రాజేందర్‌రెడ్డితో పాటు మరికొందరు ఈ ఉద్యమంలో భాగస్వామ్యమయ్యారు. 1927లో హరిజనోద్ధరణ ఉద్యమంలో భాగంగా విరాళాల సేకరణకు శ్రీకాకుళం వచ్చిన మహాత్మాగాంధీకి, ప్రస్తుతం నాగావళి హోటల్ ఉన్న స్థలంలో పౌర సన్మానం చేశారు. ఆ సమయంలో పొందూరు ఖద్దరుపై సన్మాన పత్రం రాయించారు. గాంధీజీ వెళ్లేందుకు వీలుగా వంశధార నదిపై ప్రస్తుత మడపాం బ్రిడ్జి వద్ద కాజ్‌వేను ఏర్పాటు చేశారనే ఉద్దేశంతో బ్రిటిష్ ప్రభుత్వంలో పనిచేస్తున్న ఇంజినీర్ రామచంద్రపాడిని ఉద్యోగం నుంచి తొలగించింది. 1928లో బ్రిటన్ ప్రభుత్వం భారతదేశానికి పంపించిన సైమన్ కమిషన్ గో బ్యాక్ అంటూ తీర్మానం చేసిన ఏకైక పాలకవర్గంగా శ్రీకాకుళం మున్సిపల్ పాలకవర్గం నిలిచింది. అప్పట్లో చట్టి పూర్ణయ్య పంతులు చైర్మన్‌గా నిలిచారు. ఇది ఆ సమయంలో చర్చనీయాంశంగా, ఉద్యమానికి ఆదర్శంగా నిలిచింది. స్వాతంత్ర్య ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు నిర్వహించిన ఆంధ్ర కాంగ్రెస్ మహాసభలకు కళింగపట్నం వేదికైంది. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కప్పగంతుల రామయ్య అధ్యక్షులుగా వ్యవహరించారు.

అప్పట్లో బ్రిటిష్ ప్రభుత్వానికి నిరసన తెలపడానికి విప్లవ భావజాలం కలిగిన కొంత మంది ఉద్యమకారులు కళింగపట్నం పోస్టాఫీస్‌ను లూటీ చేశారు. స్వాతంత్ర్య సమరంలో మరో కీలక ఉద్యమంగా నిలిచిన ఉప్పు సత్యాగ్రహం పిలుపునకు జిల్లాలో పెద్దఎత్తున స్పందించారు.

బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంతబొమ్మాళి మండలం నౌపడ ఉప్పు పరిశ్రమల వద్ద నిర్వహించిన సభలో 'మాకొద్దీ తెల్లదొరతనం' అంటూ పోలాకి మండలానికి చెందిన గరిమెళ్ల సత్యనారాయణ పాడిన పాట స్వాతంత్ర్య ఉద్యమానికి పెద్ద ఊపునిచ్చింది. ఆ తర్వాత ఆయన్ను జైల్లో పెట్టారు. బ్రిటిష్ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటూ అరాచకాలకు పాల్పడుతున్న మందస జమిందారీపై వీరగున్నమ్మ ఆధ్వర్యాన పెద్దఎత్తున ఉద్యమం చేపట్టారు. అందులో గున్నమ్మ వీర మరణం పొందారు. స్వాతంత్య ఉద్యమానికి అనుబంధంగా కీలకమైన రైతు పరిరక్షణ పాదయాత్ర ఇచ్ఛాపురంలో ప్రారంభించి, మద్రాస్ వరకూ నడిపారు. దీనికి పుల్లెల శ్యామసుందరరావు, ఆయన గురువు గౌతు లచ్చన్నతో పాటు అనేకమంది ఈ యాత్రలో పాల్గొన్నారు. ఈ యాత్రలో పాల్గొనకుండా ఎందరినో అరెస్టు చేశారు. సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలోని రెడ్ ఆర్మీపై యుద్ధం చేసేందుకు మద్రాసు నుంచి రైల్లో వెళ్తున్న బ్రిటీష్ ఆర్మీని అడ్డుకునేందుకు కొందరు విప్లవకారులు టెక్కలి సమీపంలోని రైలు పట్టాలను తొలగించారు.

స్వాతంత్ర్యాన్ని కోరుతూ జిల్లాకు చెందిన మంత్రప్రగడ బంగారమ్మ మూడు రంగుల జెండాతో ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకూ యాత్ర చేపట్టారు. అప్పట్లో ఒక మహిళ స్వాతంత్ర్య కోసం ఇలాంటి పనికి పూనుకోవడం ఎందరికో స్ఫూర్తినిచ్చింది. స్వేచ్ఛా ఉద్యమానికి కీలక దశ అయిన 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో జిల్లా ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభ దశలో పుల్లెల శ్యామసుందరరావును బ్రిటీష్ ప్రభుత్వం గృహ నిర్బంధంలో ఉంచగా, ఆయన అందులోనే మృతి చెందారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పుల్లెల శ్యామసుందరరావు, గరిమెళ్ల సత్యనారాయణ, బులుసు సాంబయ్య, చట్టి పూర్ణయ్య పంతులు, దుక్క రాజేంద్రరెడ్డి, శశిభూషణ్‌గుప్త, దూసి రంగారావు, కప్పగంతుల రామయ్య, కిల్లి అప్పలనాయుడు, మార్పు పద్మనాభం, చౌదరి సత్యనారాయణతో పాటు అనేకమంది స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములయ్యారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

దేశభక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా

- ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా
- ప్రధాన కూడళ్లలో సెల్ఫీ పాయింట్లు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతి పౌరునిలో దేశభక్తి భావాన్ని రగిలించి, దేశ సమగ్రతను పెంపొందించేలా ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యాన అంబేద్కర్ కూడలి నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో సాగిన చైతన్య ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఏడు రోడ్ల కూడలి వద్దకు చేరుకున్న అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరునిగా దేశ సమగ్రతను, జాతీయ సమైక్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశ సమగ్రతను, సామరస్యాన్ని, జాతీయ పతాకం ప్రాముఖ్యతను మరింత పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా మహోన్నత కార్యక్రమమని చెప్పారు.

అంతకుముందు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలపై కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో జిల్లా పర్యాటక అధికారి నారాయణరావుతో కలిసి బుధవారం అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి జాతీయ జెండాలను చేత పట్టి ర్యాలీలు నిర్వహించాలన్నారు. వాటి ఫొటోలను తీసి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయించాలని డిఇఒ తిరుమల చైతన్యను ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో జాతీయ సమైక్యతపై పోటీలు నిర్వహించాలన్నారు.

ఈ పోటీల కోసం మైనర్ పంచాయతీకి రూ.పది వేలు, మేజర్ పంచాయతీకి రూ.25 వేలు చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలతో పెద్దఎత్తున జెండాలను చేత పట్టి గ్రామాల్లో రాలీలను నిర్వహించాలని డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్‌ను ఆదేశించారు. మండల ప్రధాన కేంద్రాలు, మున్సిపాల్టీలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లలో అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి సెల్ఫీ దిగి అప్‌లోడ్ చేయించాలన్నారు. జిల్లాలో ఎటుచూసినా దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, మెప్మా పీడీ కిరణ్, డిఎస్‌డిఒ శ్రీధర్, డిఎస్‌పి ఎల్.శేషాద్రి, పలు పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన జాగరణ

- వినోదం, విజ్ఞానంతో కూడిన కార్యక్రమాల ప్రదర్శన
- స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటిచెప్పేలా సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిఐటియు ఆధ్వర్యాన నగరంలోని బాపూజీ కళామందిర్‌లో బుధవారం నిర్వహించిన 'జన జాగరణ' సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఆకట్టుకుంది. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన వేడుకలు రాత్రి 12 గంటల వరకు కొనసాగాయి. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని చాటిచెప్పేలా కోలాటం, పాటలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు వంటి విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఉత్సాహంగా, వినోదంగా, విజ్ఞానాత్మకంగా సాగాయి. ఆశా వర్కర్లు చేసిన కోలాటం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చేసిన నృత్యాలు, ప్రజా నాట్యమండలి కళాకారులు పాడిన పాటలు, ఉమామహేశ్వరరావు మ్యాజిక్ షో, వై.సౌమ్య శాస్త్రీయ నృత్యం, పిల్లల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వ్యాఖ్యాతగా ఎం.వి కామేశ్వరరావు వ్యవహరించారు. జన జాగరణ సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించిన, విజయవంతం చేసిన వారికి సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎం.ఆదినారాయణ మూర్తి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి, సిఐటియు జిల్లా నాయకులు భవిరి కృష్ణమూర్తి, ఎ.మహాలక్ష్మి, ఎన్.వి.రమణ, కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, ఎం.గోపి, జి.అమరావతి, డి.ధనలక్ష్మి కె.కళ్యాణి, పలు సంఘాల నాయకులు కె.శ్రీనివాసు, డి.చందు, సిహెచ్.రాజు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు ఆర్ట్స్ కళాశాలలో జెండా పండుగ
- పతాకావిష్కరణ చేయనున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వర రెడ్డి పరిశీలించి, పలు సూచనలు చేశారు. పెద్దసంఖ్యలో విద్యార్థులతో పాటు అధికారులు, రాజకీయ ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులు పాల్గొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇరువైపులా త్రివర్ణ పతాకాలను బారికేడ్లకు ఏర్పాటు చేశారు. పోలీస్ పెరేడ్‌తో పాటు ఎన్‌సిసి క్యాడెట్లు, స్కౌట్, గైడ్స్ విద్యార్థులు గౌరవ వందనం అందించనున్నారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలిసేలా శకటాలు, స్టాల్స్‌ను ప్రదర్శించనున్నారు. ఇందులో ఆకట్టుకున్న మూడు శకటాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నారు.

పటిష్ట బందోబస్తు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఆర్ట్స్ కళాశాల మైదానం పరిసర ప్రాంతాలను బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. వేడుకలు నిర్వహించే మైదానం వద్దకు కేవలం విఐపి వాహనాలనే అనుమతించనున్నారు. పలు పాఠశాలల విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు, ఇతర వాహనాలకు కోడి రామ్మూర్తి స్టేడియం వద్ద పార్కింగ్ స్థలాన్ని కేటాయించనున్నారు.



కవాతును పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పెరేడ్ రిహార్సల్స్ పరిశీలన

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పోలీసుల కవాతు రిహార్సల్స్, భద్రత, బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పరిశీలించారు. ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది, పోలీసు బ్యాండ్ సిబ్బంది, స్కౌట్స్ విద్యార్థులతో చేసిన పరేడ్ సాధన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు సాధన నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా సిబ్బంది నుంచి ఎస్‌పి గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించారు. పోలీస్ పరేడ్ సమిష్టిగా, సమన్వయంతో నిర్వహించి ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని సాయుధ బలగాలకు సూచించారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, జాతీయభావం వెల్లివిరిసేలా సాధన చేయాలన్నారు. మైదానంలో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్, భద్రత, బందోబస్తుపై చర్చించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలకు 256 మంది ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 256 మందికి ఉత్తమ పురస్కారాల కోసం ఎంపిక చేశారు. 92 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 242 మందిని ఉత్తమ సేవకులుగా సిఫార్సు చేశారు. తొమ్మిది స్వచ్ఛంద సంస్థల నుంచి 14 మందికి పురస్కారాలు అందించాలని నిర్ణయించారు. జిల్లా పోలీసు శాఖ నుంచి 19 మందిని ఉత్తమ పురస్కారాలకు ఎంపిక చేశారు. పురస్కారాల్లో అధికారుల కంటే సిబ్బందికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన వారికి సైతం అవార్డులకు ఎంపిక చేయడం గమనార్హం. వంశధార విభాగం టెక్కలి ఇఇగా బి.శేఖర్ ఈ ఏడాది జూన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను సైతం అవార్డుకు ఎంపిక చేశారు.

మోడల్ ఆస్పత్రిగా కోటబొమ్మాళి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కోటబొమ్మాళి 30 పడకల ఆస్పత్రిని మోడల్ ఆస్పత్రిగా తీర్చుదిద్దుతానని, అందులో భాగంగానే 50 పడకలుగా మార్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిని బుధవారం తనిఖీ చేసి, అధికారులతో సమీక్షించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇన్ పేషెంట్లకు, రోగులకు సహాయంగా వచ్చిన వారికి భోజన సౌకర్యం కల్పించేందుకు ఏదో ఒక హోటల్‌కు కాంట్రాక్టు ఇవ్వాలని సూచించారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న జనరల్ సర్జన్, గ్రేడ్-1 ఫార్మాసిస్టు ఆఫీస్ సబార్డినేట్, సర్జన్, ఎలక్ట్రీషియన్ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. ప్రైవేటు ఆస్పత్రికి ధీటుగా తీర్చిదిద్దాలని సూచించారు. వారం రోజుల్లో ఆస్పత్రికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీనిచ్చారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఆకస్మికంగా ఆస్పత్రి పరిశీలనకు వస్తుంటానని, అందుబాటులో లేని వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ కళ్యాణబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ పొన్నాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబరు 14వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జిల్లా కోర్టుతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు, పాలకొండ, రాజాం కోర్టుల్లో ఆరోజున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కోర్టు భవనంలో ఇన్సూరెన్సు కంపెనీలు, న్యాయవాదులు, బ్యాంకర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. రాజీ పడ దగిన క్రిమినల్, సివిల్, బ్యాంకు సంబంధించిన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇన్సూరెన్స్ అధికారులు ఎక్కువ సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులను రాజీ చేయడం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు వై.సూర్యారావు, ఎల్.గోవిందరాజులు, ఎం.జనార్ధన, బి.ఎస్ చలం, బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో మూడు అన్న క్యాంటీన్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో మూడు చోట్ల అన్న క్యాంటీన్లను ప్రారంభించడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. పంద్రాగస్టును పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను టిడిపి కూటమి ప్రభుత్వం ప్రారంభించడానికి నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో పాతబస్టాండ్, ఏడురోడ్ల కూడలి, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో బస్టాండ్ వద్ద ప్రారంభానికి సిద్ధమయ్యాయి. వీటిని ఈనెల 16న కేంద్ర, రాష్ట్ర మంత్రులు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించనున్నారు. 2018 ఆగస్టులో ప్రారంభమైన అన్న క్యాంటీన్లు 2019 ఫిబ్రవరిలో మూతపడ్డాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు తెరుచుకోలేదు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గతంలో మూతపడిన అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి తెరిపించడానికి మున్సిపల్‌శాఖ ద్వారా ఒక్కో క్యాంటీన్‌కు రూ.13 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులను వెచ్చించి గతంలో నిర్మించిన భవనాలను క్యాంటీన్లుగా మార్పులు చేసి ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు ఒక కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. 70 మంది ఒకేసారి భోజనం, అల్పాహారం చేసేందుకు వీలుగా స్టీల్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ ద్వారా టోకెన్లు జారీ చేయడానికి నిర్ణయించారు. వీటి నిర్వహణ బాధ్యతను గతంలో మాదిరిగా రాష్ట్రవ్యాప్తంగా హరేరామ స్వచ్ఛంద సంస్థకు మూడు పూటలా ఆహారం సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్నారు.

మెనూ ఇలా..

మెనూలో వారంలో ఆరు రోజులు అల్పాహారంగా ఇడ్లీతో పాటు ఆరు రోజుల్లో రెండు రోజులు పూరీ, ఉప్మా, పొంగల్ అందుబాటులో ఉంచనున్నారు. అల్పాహారంగా ఇడ్లీలు మూడు, ఉప్మా, పొంగల్ 250 గ్రాములు, చట్నీ 15 గ్రాములు, సాంబార్ 150 గ్రాములు ఇవ్వనున్నారు. లంచ్, డిన్నర్లో వైట్ రైస్-400 గ్రాములు, పప్పు 120 గ్రాములు, కూర 100 గ్రాములు, పెరుగు 75 గ్రాములు, పచ్చడి 15 గ్రాములు వడ్డించనున్నారు. వారానికి ఒక రోజు స్పెషల్ రైస్. ఆదివారం సెలవుగా నిర్ణయించడంతో మిగతా రోజుల్లో అల్పాహారం ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు, లంచ్ మధ్యాహ్నం 12.30 నుంచి మూడు గంటల వరకు, డిన్నర్ 7.30 నుంచి తొమ్మిది గంటల వరకు అందుబాటులో ఉంటుందని అధికారులు చెప్తున్నారు. కేవలం రూ.5కే వీటిని సరఫరా చేయనున్నారు. సెల్ఫ్ సర్వీస్ మోడ్‌లో వీటిని వినియోగదారులకు సరఫరా చేస్తారు. రోజూ మూడు పూటలు కలుపుకొని 1200 మందికి ఆహారం సరఫరా చేయాలని ఆలోచన చేస్తున్నారు. ధరల పట్టికతో పాటు మెనూ బోర్డును అన్న క్యాంటీన్లలో ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మొదట మూడు ఇడ్లీలు సరఫరా చేసి రద్దీ పెరగడంతో రెండు ఇడ్లీలను సరఫరా చేశారు. రద్దీ పెరిగితే మెనూలో మార్పులకు అవకాశం ఉంటుందని నిర్వాహకులు చెప్తున్నారు.

రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రణాళిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భూ సమస్యల పరిష్కారానికి వీలుగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సిద్ధం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రెవెన్యూ, ల్యాండ్ సర్వే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పలు శాఖల సమన్వయ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి బుధవారం నిర్వహించారు. 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. గ్రామాల వారీగా సదస్సుల నిర్వహణకు ముందస్తు షెడ్యూల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధానంగా మ్యుటేషన్, వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్లు, 1బి, దారి సమస్య, భూ తగాదాలు వంటి అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటిని పరిష్కరించుకునేందుకు చక్కటి అవకాశమన్నారు. 22ఎ, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించిన రికార్డులను సైతం సిద్ధం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో తహశీల్దార్ పరిధిలో ఉన్న ఏపి రెవెన్యూ గ్రామాల్లో భూ సమస్యలు నిర్ధారణ కావాలన్నారు. ఆరు నెలలుగా భూ సమస్యలపై అనేక ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలించి సంబంధిత పత్రాలను సిద్ధం చేయాలని చెప్పారు. గ్రామాల్లో సదస్సులు నిర్వహించడం ద్వారా ఒత్తిడి తగ్గుతుందని, తీసుకున్న వినతులపై 45 రోజుల తర్వాత మరో 45 రోజుల్లో సమస్యల పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. సదస్సుల్లో మండల సర్వేయరు, దేవాదాయ, వక్ఫ్ బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీశాఖల అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. సదస్సుల నిర్వహణకు ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమిస్తామన్నారు. ఆర్‌డిఒలు డివిజన్ పరిధిలో ఉన్న మండలాలలో సదస్సుల నిర్వహణను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, స్థానిక ప్రజాప్రతినిధులనూ భాగస్వామ్యం చేయాలన్నారు. సదస్సులో తహశీల్దార్లు, ఆర్.ఐ, సర్వేయర్లు అన్ని రకాల రికార్డులను తీసుకొచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు నిర్ణీత సమయం లోపు నోటీసులు ఇచ్చి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో భూ తగాదాలు ఎక్కువగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి ఈ సదస్సులు దోహదపడతాయన్నారు. రికార్డుల టాంపరింగ్, కొలతల్లో వ్యత్యాసం, ప్రభుత్వ భూముల కబ్జాకు గురై ఉంటే వాటి సంరక్షణకు చర్యలు తీసుకునేందుకు వీలువుతుందన్నారు. సమావేశంలో పి.ఎం.జె బాబు (టిడిపి), రౌతు శంకరరావు (వైసిపి), డి.గోవిందరావు (సిపిఎం), బిర్లంగి ఉమామహేశ్వరరావు (బిజెపి), డిఆర్ఒ అప్పారావు, ఆర్‌డిఒలు సుదర్శన్ దొర, భరత్‌నాయక్, తహశీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.


అశోక్‌ను శాలువ కప్పి సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

మాజీ కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజును ఎమ్మెల్యే గొండు శంకర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విజయనగరంలోని అశోక్ గజపతిరాజు నివాసానికి బుధవారం ఎమ్మెల్యే శంకర్ చేరుకుని ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలపై ఇరువురు చర్చించారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో పర్యటించాలని విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ... అభివృద్ధికి సహకరిస్తామని హామీనిచ్చారు.


నిలిచిపోయిన కరకట్టల పనులను పరిశీలిస్తున్న డిఇఇ రమేష్ తదితరులు

కరకట్టలు పరిశీలన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని నాగవళి నదీ తీర గ్రామాలను జంపర కోట సబ్ డివిజన్ డిఇఇ ఎ.రమేష్ బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం విస్తరంగా వర్షాలు కురుస్తున్న కారణంగా నది తీర గ్రామాలైన జిబిపురం, అల్లెనలో నది నీటి ప్రవాహం పెరిగితే కరకట్టలు లేకపోవడంతో తాము బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని, తమ గ్రామాల సమీపంలో పూర్తిస్థాయిలో కరకట్టలు నిర్మించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కోరారు. ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల పరిధిలో కరకట్టలు ఏ మేరకు అవసరమవుతాయన్న విషయంపై అధికారులు పరిశీలన జరిపారు. ఈ నివేదికను ఎమ్మెల్యేకు అందజేస్తామన్నారు. ఆయనతో పాటు జి.కార్తీక్, కె.యశ్వంత్ ఉన్నారు.

ప్రతిష్టాత్మక అవార్డుకు 'బాడాన' ఎంపిక

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ది ఫెయిర్ విజన్ ఫౌండేషన్ సంస్థ సర్టిఫికేట్ ఆఫ్ అచీవ్‌మెంట్ స్వాతంత్ర నాయక్ సమ్మాన్ అవార్డుకు ప్రముఖ స్వచ్ఛంద సేవకులు డాక్టర్. బాడాన దేవభుషనరావు ఎంపికయ్యారు. వర్చ్యువల్ విధానంలో సంస్థ బుధవారం ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేశారు.

నీలావతిలో విష జ్వరాలు

15 రోజులుగా మంచం పట్టిన రోగులు

ప్రజాశక్తి- పలాస

ఆ గ్రామంలో ప్రజలు విష జ్వరాలతో బాధ పడుతున్నారు. ఏ ఇంటికి వెళ్లి తొంగి చూసినా రోగులు మంచంపట్టి ఉన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో పర్యటించక పోవడం, తూతూ మంత్రంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి సమీపంలో ఉన్న పలాస, కాశీబుగ్గ ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించు కుంటున్నారు. మండలంలోని నీలావతిలో సొర దమయంతి, సొర అఖిల్, సొర నిఖిల్, గొరకల రోహిత్, గొరకల తనివి, గొరకల బాలకృష్ణ, దున్న నీలమ్మ, ఎస్.గణపతి, సొర పోలమ్మ పాలిన జాలిబి, ఎస్.రాకేష్, ఇరోత్ కుమార్ ఇలా పదుల సంఖ్యలో విష జ్వరాలతో బాధపడుతున్నారు. గత 15 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నా వైద్యాధికారులు ఎవరు పట్టించుకోలేదు. దీంతో రోగులు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు విశాఖపట్నంలోని ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందు తున్నారు. వాస్తవానికి సీజన్ సమయాల్లో వైద్యాధికారులు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలి. కానీ ఆ దిశగా వైద్యాధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రోగులు తప్పని సరి పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. సొరా అఖిల్, సొరా నిఖిల్, పాలిన జాలిబికి ఒక్కొక్క వ్యక్తికి సుమారు రూ.40 నుంచి రూ.70 వేల వరకు ఖర్చు అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గొరకల తనివి, రోహిత్ చిన్నారులను విశాఖపట్నం ఆస్పత్రికి తరలించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తూతూమంత్రంగా వైద్య శిబిరం

నీలావతిలో 15 రోజులుగా జ్వరాలతో బాధపడుతుంటే బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారులు చెబుతున్నారు. ఒకవైపు గ్రామంలో జ్వరాలు తగ్గుదని చెబుతునే... మరోవైపు వైద్య శిబిరంలో సుమారు 10 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించామని వైద్యాధికారులు చెబుతుండటం గమనార్హం. ఇదిలా ఉండగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి తూతూ మంత్రంగా నిర్వహించారని రోగులు, గ్రామస్తులు ఆరోపించారు. మధ్యాహ్నం సమయం కాక ముందే వైద్య శిబిరాన్ని ఎత్తివేయడం అందుకు నిదర్శనం. వైద్యాధికారులు ఎప్పుడూ వస్తున్నారో? ఎప్పుడు వెళ్లిపోతున్నారో తెలియడం లేదని సర్పంచ్ సొర పద్మావతి, తిరుపతిరావు ఆరోపిస్తున్నారు.


జ్వరంతో బాధపడుతున్న దమయంతి

ఇదే విషయంపై రెంటికోట వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్‌ను వివరణ కోరగా, గ్రామంలో జ్వరాలు ఉన్న మాట వాస్తవమే అని చెప్పారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఇందులు ఐదు మందికి పైగా జ్వరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. గురువారం కూడా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా


నౌపడ : బోట్లపై జెండాను ఎగురవేస్తున్న మత్స్యశాఖ అధికారులు

ఇచ్ఛాపురం: గురువారం ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ పిలుపునిచ్చారు. ఘనంగా హర్ ఘర్ తిరంగ్‌లో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరిలోనూ దేశభక్తి పెరగాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, బుద్ధాల నిర్మలారెడ్డి, డిటి శ్రీహరి, కాళ్ల ధర్మారావు, నందిక జాని, కాళ్ల దిలీప్, జానకీరావు, నందిగాం కోటేశ్వరరావు, జన్నెల సంతోష, జిలానీ, లీలారాణి, పద్మనాభం పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ ప్రజ్ఞ జూనియర్, డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన బుధవారం హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మూడు రోడ్ల జంక్షన్, పాత బస్టాండ్ వద్ద మానవ హారం నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కళాశాల డైరెక్టర్ ఎ.వి.కె. శాస్త్రి, ప్రిన్సిపాళ్లు నారాయణ, ఖగేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

టెక్కలి : ఘనంగా హర్ ఘర్ తిరంగ్‌లో భాగంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కాంప్లెక్స్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఎలొలు కంది గోళ్ల, వి.లూక్‌పాల్, డి.వాసుబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : హర్ ఘర్ తిరంగ్‌లో భాగంగా టెక్కలిలో బుధవారం భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. టెక్కలికి చెందిన పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు జెండాతో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద మానవహారం నిర్వహించి 'జై భారత్', 'వందేమాతరం' అంటూ నినాదాలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జాతీయ జెండా ప్రదర్శన చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆమదాలవలస: అన్ని గ్రామాల్లో హర్‌ఘర్ తిరంగ్ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపిఎం పైడి కూర్మారావు మహిళలకు సూచించారు. బుధవారం మండల సమాఖ్య ఆవరణలో మహిళా ప్రతినిధులతో పాటు పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆజాదికా అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో మహిళలు ఈ జాతీయ పండగ పర్వదినాన్ని రంగవల్లులతో, పిల్లలు పెద్దలు అందరూ పాల్గొని జాతీయ భావాన్ని పెంపొందించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. మహిళా స్వయం శక్తి సంఘాలు గ్రామాల్లో ర్యాలీగా ఈ స్వాతంత్ర్య దినోత్సవ జెండా పండగ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్


టెక్కలి రూరల్ : భారీ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం భావంపాడు సముద్రం తీరంలో జిల్లా మత్స్యశాఖ జెడి పి.వి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన బుధవారం హర్‌ఘర్ తిరంగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని పిలుపు మేరకు కలెక్టర్ ఆదేశాలతో మత్స్యకారులతో కలిసి సముద్రంలో బోట్లపై కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు, గ్రామస్తులు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టెక్కలి ధర్మరాజు పాత్ర , ఫిషరీస్ అసిస్టెంట్లు, సాగర మిత్రలు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి సందర్శన

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లికి టెక్కలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు బుధవారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణ ఆధ్వర్యాన అర్చకులు కమ్మకట్టు రాజేష్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విశిష్టితను సిఐకు వివరించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సిఐ సందర్శించారు. సిఐకు ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ పాల్గొన్నారు.


దర్శించుకుంటున్న సిఐ శ్రీనివాసరావు

కేన్సర్ నిర్మూలనకు తోడ్పాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజల ప్రాణాలను కబలిస్తున్న మహమ్మారి కేన్సర్ వ్యాధిని అరికట్టాలన్న ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చే బాధ్యత ప్రయివేటు మెడికల్ ప్రాక్టీషనర్స్‌పై ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఏడురోడ్ల కూడలిలో ఉన్న ప్రెస్‌క్లబ్‌లో కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జెమ్స్ ఆస్పత్రి సంయుక్తంగా కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే ఈ వ్యాధి బారి నుంచి బయట పడవచ్చునని తెలిపారు. కేన్సర్‌పై ప్రజలకు అవగాహన లేకపోవడం వలన నాలుగో దశలో గుర్తిస్తున్నారని, అప్పటికే తీవ్రనష్టం వాటిల్లుతోందన్నారు. కేన్సర్ అనే పదం వింటే చాలు ఒక రకమైన ఆందోళన మనలో కలుగుతుందని, ఇది ప్రాణాలు తీసే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అని చాలా మంది భావిస్తున్నారన్నారు. కేన్సర్స్ ఉన్న చాలా మంది ఒకానొక సమయంలో బాగా బరువు తగ్గిపోతుంటారని చెప్పారు. ఐదు లేదా అంతకంటే ఎక్కువ కేజీలు బరువు తగ్గిపోవడాన్ని కేన్సర్ తొలి సంకేతంగా చూడొచ్చునని పేర్కొన్నారు. పాంక్రియాస్, కడుపు, ఊపిరితిత్తుల కేన్సర్, అన్నవాహిక కేన్సర్ వచ్చినప్పుడు ఇలా జరుగుతూ ఉంటుందన్నారు. కేన్సర్ వచ్చిన రోగుల్లో జ్వరమనేది సాధారణ లక్షణమన్నారు. ప్రయివేటు మెడికల్ ప్రాక్టీషనర్స్‌కు సర్టిఫికేట్ కోర్సుకు సంబంధించి 70 శాతం పూర్తయిందని 30 శాతం మిగిలి ఉందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు హామీమేరకు శతశాతం పూర్తి చేసి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అనంతరం ఏడురోడ్ల కూడలి వద్ద కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వండాన సిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఆది నారాయణ, కోశాధికారి కె.జనార్థన, జాయింట్ సెక్రటరీ సిహెచ్ రాము, సీనియర్ మెంబర్ డోల వాసు, అప్పలరాజు, ముసలినాయుడు, కె.మోహనరావు, రాజారావు, జెమ్స్ వైద్యులు బమ్మిడి సందీప్, ఎం.వెంకటరమణ, నందన రవీంద్ర తదితులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

ఎన్‌టిఆర్ గృహాలకు బిల్లులు చెల్లించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: గత ఐదేళ్లుగా గృహ నిర్మాణశాఖలో ఏం జరిగిందో తనకు తెలుసని, ప్రస్తుతం పూర్తిస్థాయి ప్రక్షాళన జరగాల్సి ఉందని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. హౌసింగ్ శాఖ పీడీ నగేష్ అధ్యక్షతన మంగళవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014-19 వరకు ఎన్‌టిఆర్ గృహ స్కీం కింద ఇళ్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఎందుకు బిల్లులు చెల్లించలేదని నిలదీశారు. చాలామంది లబ్ధిదారులకు ఒక రూపాయి వేసి చేతులు దులుపుకున్నారని ప్రశ్నించారు. వంద రోజుల ప్రణాళిక ఏర్పాటు చేసుకుని భవిష్యత్ కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రాబోయే అరవై రోజుల్లో కనీసం 1500 ఇళ్లు లక్ష్యంగా చేసుకోవాలని సూచించారు. కవిటిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలిచిన హుదూద్ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ 2014-19లో దాదాపు రూ.5.80 కోట్లు పెండింగ్ నిధులను ప్రభుత్వ దృష్టిలో పెట్టి వీలైనంత త్వరగా నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. వచ్చే రెండు నెలల్లో కనీసం 1500 ఇళ్లు పూర్తయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజినీర్ నర్సింగరావు, ఇచ్ఛాపురం అర్బన్ ఏఇలు శివరామకృష్ణ, అప్పారావు, సాయి, ప్రదీప్, దిలీప్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి- పలాస

పేదలకు మూడు పూటలు భోజనం పెట్టి ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారని, శుక్రవారం ఉదయం పలాసలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ప్రారంభానికి సిద్ధం చేసిన అన్న క్యాంటీన్‌ను బుధవారం పరిశీలించారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారా? లేదా? ఏమైనా చేయాల్సి ఉందా? తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, టంకాల రవిశంకర్ గుప్తా, కొరికాన శంకర్, సాసుమాన చంద్రమౌళి, మల్లా శ్రీనివాసరావు, జోగ మల్లి, కొత్త సత్యం, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ అవినాష్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- కొత్తూరు

వంశధార నిర్వాసితుల సమస్యల పరిష్కరిస్తామని కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హామీనిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ముందుగా వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు మాట్లాడుతూ వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే వంశధార కరకట్ల నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిపోయాయని తెలిపారు. నివగాంలో కుమ్మరవీధి రోడ్డు నిర్మించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ... నిర్వాసితులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యను తెలుసుకుంటానని అన్నారు. ఈ సమస్యను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గొట్టిపల్లి ఆశ్రమ పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎన్‌ఆర్‌ఐ బి.రాజుతో ఫోన్ మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.30 వేలు ఇస్తామని రాజు ప్రకటించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలని ఎఒ స్వర్ణలతకు సూచించారు. మెట్టూర్ బిట్-3లో రోడ్డు అధ్వానంగా తయారైందని సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై జెఇ దుర్గాప్రసాద్ స్పందిస్తూ... కాలనీలోని రోడ్లు వేయాలంటే కొంత సమయం పడుతుందని అన్నారు. ఆకులతంపర సర్పంచ్ నాగల్ల అప్పన్న మాట్లాడుతూ తాగునీటి బోరు వేయాలని కోరారు. అనంతరం రూ.33 లక్షలతో లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.పావని, వైస్ ఎంపిపి ఎం.సుమతి, ఇఒ బి.రాంబాబు, ఐసిడిఎస్ పిఒ విమలకుమారి, ఎపిఒ ప్రమలత, ఎపిఒ ఎం.జనార్ధన్, ఎంఇఒ గోవిందరావు, ఎఒ లక్ష్మణరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

వంశధార కుడి కాలువకు నీరు విడుదల


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం అర్బన్ సాగునీరందక, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, ధాన్యం కొనేవారు లేక అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నియోజక వర్గం పరిధిలో అంపోలు పంచాయతీ లింగావలస లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బుధవారం వంశధార కుడికాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వంశధార కుడికాలువ ద్వారా సాగునీటిని సకాలంలో అందజేయక పోవడంతో రైతులు నానా అవస్థలు పడ్డారన్నారు. కాలువల్లో పూడికలు, గుర్రపుడెక్క తొలగించక పోవడంతో సాగునీరు అందని పరిస్థితి ఎదురయ్యేదని, కాలువలకు షట్టర్లు లేక నీరు శివారు ప్రాంతాలకు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు నష్ట పోయారని, ప్రత్యేక శ్రద్ధతో ముందుగా కాల్వల్లో పూడిక తీయించి సకాలంలో నీరందించగలిగామన్నారు. రైతులకు ఖరీఫ్ పంటలకు వంశధార కుడికాలువ ద్వారా సకాలంలో నీరందడం వలన రైతుల్లో ఆశలు చిగురించాయన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి ఆస్పత్రిలో రోడ్లులోని కొటారి నర్సింగ్ హోమ్‌లో శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, బంధువులు బుధవారం ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే... శ్రీకాకుళం పట్టణానికి చెందిన శివప్రసాద్ అనే వ్యక్తి ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన త్రివేణి మహంతి అనే మహిళతో కొన్నాళ్ల క్రితం వివాహం జరిగింది. త్రివేణి కాన్పు కావడంతో ఇచ్ఛాపురంలోని కన్నవారింటికి వచ్చింది. గర్భంలో ఉన్న బిడ్డకు ఎనిమిదో నెల నుంచి కొఠారి నర్సింగ్ హోమ్‌లో నిర్వహిస్తున్న డాక్టర్ మోహనరావు రౌలో పర్య వేక్షణలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం నొప్పులు రావడంతో సాయంత్రం ఆస్పత్రిలో చేర్చారు. నొప్పులు తీవ్ర ఎక్కువ కావడంతో త్రివేణి కుటుంబ సభ్యులు డాక్టర్‌ను సంప్రదించారు. డాక్టర్ వైద్య వైద్య పరీక్షలు నిర్వహించగా మగ శిశువుకు జన్మించింది. బుధ వారం డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించకపోవడంతో శిశువు మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించడానికి ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఐటిడిఎ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించిన డేటాను సామాజిక తనిఖీ బృందానికి తుచ తప్పకుండా వివరాలు అందించాలన్నారు. తనిఖీ సమయంలో ఏదైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించుకునే దిశగా సిబ్బంది పరస్పరం కలిసి పనిచేయాలన్నారు. ఎంపిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పంచాయతీల్లో జరిగిన సామాజిక తనిఖీకి సంబంధించిన నివేదికలను చదవాలన్నారు. అనంతరం ఎటువంటి చేర్పులు, మార్పులు చేయకుండా అదే నివేదికను మండలస్థాయి సమావేశంలో చదవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కరరావు, సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్‌పర్సన్ రామారావు, ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లవరాజు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని పరశురాంపురం కూడలి సమీప జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంపై వస్తుండగా... డివైడర్‌ను ఢీకొని బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో వాహనదారుడు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. వివరాలు తెలియరావాల్సి ఉంది.

ఎచ్చెర్ల : మండలంలోని పరిధిపేట పంచాయతీ కొయిరాల కూడలి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం రూరల్ మండలం తండేవలస కు చెందిన ఎ.కామరాజు గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంపై వస్తుండగా సర్వీస్ రోడ్డుపై నుంచి మెయిన్ రోడ్డుకు వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే క్షతగాత్రుడిని జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తికి జరిమానా

ప్రజాశక్తి- పొందూరు

మండలం ఇల్లయ్యగారి పేటకు చెందిన బలగ అసిరమ్మ, కొంచాడ సింహాచలం మధ్య స్థల వివాదం నెలకొంది. దీంతో బలగ అసిరమ్మపై సింహాచలం ఇనుప గుణంతో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై 2022 నవంబర్‌లో ఆమె పొందూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దీంతో పొందూరు మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ చేపట్టగా ప్రాసిక్యూషన్ తరపున రొక్కం శాంతి సంతోషి వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో పొందూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న ముద్దాయికి రూ.5 వేలు జరి మానా విధించారు. జరిమానాను కట్టలేకుంటే ఆరు నెలల జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.


సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే


సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రణస్థలం రూరల్ : 16వ జాతీయ రహదారి నుంచి తహశీల్దార్ కార్యాలయం మీదుగా వెళ్లే రహదారికి ఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుంచి రూ.33.70 లక్షలతో వేయనున్న రహదారికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో విజయ నగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జెఇ కూర్మనాథ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కోడిగుడ్డుపై గాంధీజీ, భారతదేశ చిత్ర పటం


కోడిగుడ్డుపై గాంధీజీ చిత్రం

కవిటి: జాతిపిత మహాత్మా గాంధీజీ, సుభాష్ చంద్ర బోస్, భగత్ సింగ్, భారతదేశ చిత్రపటాలను కోడి గుడ్డుపై చిత్రించిన కవిటి మండలం కుసుంపురం పంచాయతీ కార్యదర్శి కొప్పల్ల రవి ఔరా అనిపించారు. మొదటి నుంచి చిత్రలేఖనంపై ఆసక్తి ఉన్న రవి తనలో దేశభక్తిని కోడిగుడ్డుపై ప్రతిబింబించి ఆకట్టుకున్నారు.


బియ్యం స్టాక్‌ను పరిశీలిస్తున్న జడ్జి రోషిణి

కెజిబివి తనిఖీ

సారవకోట : స్థానిక కెజిబివిని పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం సమయానికి చేరుకుని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి మౌలిక వసతులపై ఆరా తీశారు. వారికి పెట్టే భోజనంపై, వసతులపై ఎలాంటి ఆంక్షలు లేవని, చక్కగా విద్యార్థులను చూసుకోవాలని ఎస్ఒకు ఆదేశించారు. పాఠశాలలోని తరగతులు, బియ్యం స్టాక్ గొడౌన్‌ను పరిశీలించారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రామకృష్ణ

సీజనల్ వ్యాధులపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- బూర్జ

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు చేపట్టాలని మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని పెద్దపేటలో వైద్యసిబ్బంది ఆయనను కలిసిన సందర్భంగా ఆయన సూచనలను చేశారు. వర్షాలు కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించా లన్నారు. రామకృష్ణను కలిసిన వారిలో సూపర్‌వైజర్ సరోజిని, హెల్త్ సూపర్‌వైజర్ జగదీష్, మురళీ మోహన్, ఆశావర్కర్లు గీత, భవాని, సత్యవతి తదితరులున్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

రోడ్డు పనులు వేగవంతం

పలాస: కాశీబుగ్గ గాంధీ నగర్ రోడ్డులో త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీష మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కాశీబుగ్గ గాంధీ నగర్ రోడ్డులో మున్సిపల్ అధికారులు తొలగించిన ఆక్రమణ స్థలాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలగించిన ఆక్రమణ స్థలంలో రోడ్డు నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిర్మాణం చేపట్టాలని సూచించారు. ముందుగా ఆ స్థలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, సాసుమాన చంద్రమౌళి, జోగ మల్లి, మల్లా శ్రీనివాసరావు, చంద్రశేఖర్ త్యాడి పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఎచ్చెర్ల: యోగా అండ్ ఫిట్నెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆరు నెలల వ్యవధిగల యోగా డిప్లొమో కోర్సులో ప్రవేశానికి ఈ విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత తెలిపారు. ఎటువంటి అదనపు రుసుం లేకుండా వీటిని ఈ నెల 31లోగా వర్సిటీ స్వీకరిస్తుందన్నారు. రూ.500 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 9లోగా దరఖాస్తులను వర్సిటీకి అందజేయవచ్చునన్నారు. ఈ కోర్సు ఫీజు రూ.5 వేలు కాగా, వర్సిటీలో ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు 30 శాతం ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. వర్సిటీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొంది, దీనికి రిజిస్ట్రార్ పేరిట తీసిన రూ.200 ఆన్‌లైన్ ఫీజు రశీదు, పదో తరగతి, డిగ్రీ అర్హత సర్టిఫికెట్లు, తరగతి, ఆధార్ జిరాక్స్ కాపీలను జతచేసి వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నవోదయకు తాడివలస విద్యార్థి ఎంపిక

పొందూరు: మండలంలోని తాడివలసకు చెందిన సీపాన భార్గవలక్ష్మి సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ పాఠశాలకు రెండో విడత కౌన్సెలింగ్‌లో ఎంపికైంది. ఈమె 6వ తరగతిలో చేరేందుకు అర్హత సాధించింది. ఈమె తాడివలసలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివింది. విద్యార్థిని నవోదయకు ఎంపిక కావడంపై ఎంఇఒలు పి.వి.రామరాజు, పి.రాజారావు, ప్రధానోపాధ్యాయులు రంగారావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.


భార్గవలక్ష్మి


పుస్తకాలను ప్రదర్శిస్తున్న కుమార్‌రాజు

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

శ్రీకాకుళం అర్బన్ : నేటి తరానికి స్వాతంత్ర్యోదమ చరిత్రను తెలియజెప్పాలన్న ఆలోచనతో జిల్లా కేంద్ర గ్రంథాలయం స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రల పుస్తకాలను బుధవారం ప్రదర్శించారు. కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్ శంకరరావులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ఎందరో త్యాగధనులు చరిత్ర పుటల్లో నిలిచి ఉన్నారని, వారి జీవితాలను ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలన్నారు. వారి స్ఫూర్తితో దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కర రాజా, పాఠకులు పాల్గొన్నారు.

ఖ్యాతి వృద్ధాశ్రమంలో అన్న వితరణ

శ్రీకాకుళం అర్బన్ : కొంక్యాన గోవిందరాజులు 14వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఖ్యాతిఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్న వితరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొంకాన్య మురళీధర్ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, వేడుకలకు అధిక ధనాన్ని వృథా చేయకుండా నిరుపేదల ఆకలి తీర్చటం ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. ట్రస్టు ఆధ్వర్యాన ఏటా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఫౌండేషన్‌కు అవసరమైన సామగ్రిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు, ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, సరోజ, ఖ్యాతి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ ఆర్.శ్రావణి, కొంక్యాన శివశంకర్ పాల్గొన్నారు.

పిహెచ్‌సి అభివృద్ధికి నిధుల మంజూరు

ఆమదాలవలస : నియోజకవర్గంలోని బూర్జ మండలం గుత్తావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి శాసనసభ్యులు కూన రవికుమార్ కృషి ఫలితంగా నిధులు మంజూరయ్యాయని టిడిపి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో పిహెచ్‌సి లేబొరేటరీ, హెచ్‌ఎంఐఎస్ యూనిట్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పిహెచ్‌సి అభివృద్ధికి అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన సిఎం చంద్రబాబు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

గొయ్యిలో దిగబడిన లారీ

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి కూడలి ఆర్‌టిసి బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఎబి రోడ్డు గోతిలో బుధవారం రాత్రి భారీ వాహనం దిగబడింది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో శ్రీకాకుళం, బత్తిలి, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రొక్లెయినర్ సహాయంతో లారీని బయటకు తీశారు.



ఏడాది క్రితం పోలీస్ స్టేషన్ నుంచి ఆర్‌టిసి బస్‌స్టేషన్ వరకు రహదారిపై ఉన్న భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో ఇసుక లారీలు, గ్యాస్ లారీలు, భారీ వాహనాలు పలుమార్లు ఇరుక్కున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

చదువు మళ్లీ కొనసాగిద్దాం

ప్రజాశక్తి- రణస్థలం

మానేసిన చదువు మళ్లీ కొనసాగిద్దాం - బంగారు భవితకు బాటలు వేద్దామన్న నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్‌ను ప్రభుత్వం సర్వజనులకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని ఎంఇఒలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య అన్నారు. రణస్థలం, పైడిభీమవరం హైస్కూల్‌లో బుధవారం ఎపి ఓపెన్ స్కూల్ (2024-25) అడ్మిషన్స్ ప్రారంభ పక్రియకు సంబంధించి రణస్థలం, పైడిభీమవరం కేంద్రాల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి 2008-09 విద్యా సంవత్సరం నుంచి పవ్రేశపెట్టినట్టు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు జరగనున్నట్టు తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో ఐదు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయని, ఆరవ సబ్జెక్టు ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చని, విద్యార్థులు తమకు నచ్చిన మాధ్యమంలో పరీక్ష రాయవచ్చాన్నారు. 10వ తరగతి ప్రవేశం కోసం తల్లిదండ్రుల పేర్లు, పుట్టినతేదీ, ఆధార్ కార్డు వంటి వివరాలు తప్పక నమోదు చేసుకోవాలన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇంటర్మీడియట్ విద్యను 2010-11 విద్యా సంవత్సరం నుంచి ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశ పెట్టబడిందని, గ్రూపుల కోసం వివరించారు. సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25కు సంబంధించి ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, వివిధ కారణాల వలన చదువు కొనసాగించలేని గ్రామీణ యువతీ, యువకులు, స్త్రీ, పురుషులు, ప్రత్యేక అవసరాలు గల వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ర్యాలీలో సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి - కవిటి

నియోజకవర్గ వ్యాప్తంగా మధ్యలో ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలు ఈ ఐదేళ్లు పూర్తిచేస్తానని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యాన బుధవారం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014-19 మధ్య నియోజకవర్గంలో పలు బ్రిడ్జిలతో పాటు ఆస్పత్రి భవనాలు, డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కానీ, గత ఐదేళ్లు కనీసం ఒక్క డయాలసిస్ బెడ్ కూడా పెంచిన పరిస్థితి లేదన్నారు. మరికొద్ది రోజుల్లోనే కవిటి, సొంపేటలో డయాలసిస్ బెడ్లు పెంచడమే కాకుండా ఇచ్ఛాపురంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాని తెలిపారు. అగ్నికుల క్షత్రియులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇచ్చారు. జనసేన సమన్వయ కర్త దాసరి రాజు మాట్లాడుతూ కూటమి నాయకుల సహకారంతో నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ రాష్ట్ర అధ్యక్షుడు రెయ్యి కోదండ కృష్ణ, కె.రాజేశ్వరరావు, బెందాళం రమేష్, కొర్రాయి వాసుదేవ్, ఆరింగి మధు, బెందాళం తిరుమల, బెందాళం సురేష్, గొరకల రామారావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అశోక్‌ను సన్మానిస్తున్న సభ్యులు


రోడ్డు పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

తారు రోడ్డు నిర్మాణం

పొందూరు: స్థానిక పాతబస్టాండ్ నుంచి పైఓవర్ వరకు ఉన్న తారు రోడ్డును బుధవారం నిర్మించారు. అధ్వానంగా రోడ్డు ఉండడంతో ఈ విషయంపై స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి ఆర్‌అండ్‌బి నిధులు రూ.6.5 లక్షలు నిధులు విడుదల చేశారు. దీంతో తారు రోడ్డును అధికారులు నిర్మించారు. ఈ పనులను మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్.రామ్మోహన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగనాయకులు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరబాస్కర్ పరిశీలించారు.

జెండా ఖర్చులకు నిధులు

టెక్కలి : స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పంచాయతీల్లో జెండా వందనాన్ని నిర్వహించే కార్యక్రమానికి నిధులు విడుదల చేస్తూ... ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై సర్పంచ్‌లు, కార్యదర్శులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జెండా పతాకా ఆవిష్కరణకూ పంచాయతీల్లో నిధులు ఉండేవి కావని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం జెండా పతాకావిష్కరణ ఖర్చుల నిమిత్తం పంచాయతీకి రూ.పది వేలు, మేజర్ పట్టణ పంచాయతీలకు రూ.25 వేలు విడుదల చేస్తూ... జిఒ జారీ అయ్యిందన్నారు. అయితే ఆ నిధులు ఇంకా పంచాయతీల అకౌంట్‌కు జమ కాలేదన్నారు. అయితే కార్యదర్శులు ప్రస్తుతానికి తమ చేతి వద్ద నుంచి నిధులు వెచ్చించేందుకు సిద్ధమయ్యారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న జర్నలిస్టులు

పిఎ పంతులుకు నివాళి

టెక్కలి రూరల్ : టెక్కలికి చెందిన తొలితరం సీనియర్ జర్నలిస్టు పి.అప్పయ్య పంతులు ఇటీవల మృతి చెందారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు అధ్యక్షతన పిఎ పంతులు సంతాపసభ బుధవారం నిర్వహించారు. ముందుగా పిఎ పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గం జనసేన నాయకులు కణితి కిరణ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు కోత మధుసూదనరావు, సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు, కోత మోహనరావు, సంపతరావు విశ్వనాథం, వి.కీర్తికుమార్, గనియా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

117 జిఒ రద్దు చేయాలి

రణస్థలం: 117 జిఒ రద్దు చేయాలని ఆపస్ మండల ప్రధాన కార్యదర్శి సింగూరు రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎంఆర్‌సిలో మండల ఆపస్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆపస్ మండల ప్రధాన కార్యదర్శి సింగూరు రాజు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 117 జిఒ రద్దు చేస్తానని బహిరంగ లేఖ రాసి హామీ ఇచ్చారని, ఆ మేరకు 117 జిఒ రద్దు చేయకపోతే ప్రాథమిక విద్య పూర్తిగా నిర్వీర్యం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే 117 జిఒ రద్దుచేసి పదోన్నతులు చేపట్టిన తరువాత పని సర్దుబాటును చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కె.లింగరాజు, ఎం.రవిభట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు

త్యాగధనుల ఫలితమే స్వాతంత్ర్యం

ప్రజాశక్తి- రణస్థలం

ఎందరో త్యాగధనుల ఫలితమే మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యం అని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని మహానుభావుల జ్ఞాపకార్థం పైడిభీమవరంలో తమ సంస్థ సభ్యుల సమక్షంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం మొదలు 1947 వరకు కుల, మత, వర్గ, ప్రాంతీయ బేధాలకు అతీతంగా ఝాన్సీ లక్ష్మీభాయి మొదలుకొని భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, గాంధీ మహాత్ముని వరకూ ఎందరో త్యాగధనుల ప్రాణ త్యాగానికి ప్రతిఫలమే నేడు మనం అనుభవిస్తున్న ఈ స్వాతంత్ర్య ఫలాలని ఆయన ఉద్ఘాటించారు. ప్రస్తుత యువతరంలో దేశభక్తి పూర్తిగా కొరవడిందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను పిల్లలకు నేర్పించడం వలన వారిలో దేశభక్తిని పెంపొందించవచ్చన్నారు.


మొక్కలు నాటుతున్న హరిబాబు తదితరులు

అనంతరం జాతీయోద్యమ నాయకుల జ్ఞాపకార్థం పూలమొక్కలు నాటారు. కార్యక్రమంలో హరిత సొసైటీ సభ్యులు పి.తవిటినాయుడు, ఆర్.మోహిత్ కుమార్, స్థానికులు గొల్లబాబు, శివ పాల్గొన్నారు.

ఎంపిడిఒలుగా బాధ్యతల స్వీకరణ


మెళియాపుట్టి : పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి ఎంపిడిఒగా పి.చంద్రకుమారి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా విజయనగరం జిల్లాలో పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా సొంత జిల్లాకు ఆమెను కేటాయించారు. గతంలో ఇదే మండలంలో ఎంపిడిఒగా పనిచేశారు. ఈమెకు కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు చింతల అప్పారావు, పోలాకి మోహనరావు, ఢిల్లేశ్వరరావు, వనజాక్షి, ధనలక్ష్మి, సరోజని పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి ఎంపిడిఒగా చింతాడ లక్ష్మీభాయి బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లారు. తాజాగా ఎంపిడిఒలకు కేటాయించిన స్థానాల్లో టెక్కలిలో బాధ్యతలు చేపట్టారు. ఈమెకు సిబ్బంది స్వాగతం పలికారు.

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కుప్పిలి ఫణీంద్రకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గడిచిన సర్వత్రిక ఎన్నికల ముందు ఇక్కడ నుంచి విజయనగరం వెళ్లారు. మళ్లి అక్కడ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఎంపిడిఒగా పనిచేసిన ఎచ్చర్ల పద్మజ బదిలీపై వెళ్లారు. ఎంపిడిఒకు మండల పరిషత్ సిబ్బంది, ఇఒపిఆర్‌డి, సూపరింటెండెంట్లు స్వాగతం పలికారు.

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపి కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కణితి సురేష్ చౌదరి అన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్వర్యాన బుధవారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార శివారు గ్రామాలకు ఎమ్మెల్యే గౌతు శిరీష కృషితో నీరు అందిందని అన్నారు. ఈ సందర్భంగా 400 డిఎపి బస్తాలు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మాజీ సభ్యులు నెయ్యల సూర్యనారాయణ, సొసైటీ అధికారులు కృష్ణారావు, తిరుపతి, కత్తుమ కృష్ణారావు, మోహన్, త్రినాథ్, పాపారావు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు : ఎరువులను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

కవిటి: మండలంలోని మాణిక్యపురంలో రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయకుడు అన్వేష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 220 బస్తాల యూరియా, 222 బస్తాల డిఎపి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవరాజు సాహు, దేవికా సరోజ్ జెన్నా, సంతోష్ కుమార్ సాహు, ఢిల్లీ మజ్జి, మురళీ బిసాయి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పాత్రకొండలో 'పొలంబడి'

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పాత్రకొండలో ఉన్న ఓ రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. వరిలో కాలిబాటలు ప్రదర్శన, ప్రాధాన్యత వివరించారు. పాస్ఫోబ్యాక్టీరియా జీవన ఎరువులు, వివిధ రకాలుగా వాడే విధానాన్ని ప్రదర్శన చేసి చూపించారు. కాలిబాటలు తీయడాన్ని తూర్పు, పడమర దిశగా ప్రతి రెండు మీటర్లు నిడివికి 20 సెంటీమీటర్లు బాట తీయించారు. చేను బాగా పెరిగిన దశలో దుబ్బు మొదలకు గాలి తగిలి సుడిదోమ ఉధృతి తగ్గుతుందని, బాటల్లో నడిచి ఎరువులు చల్లడానికి పురుగులు పిచికారీకి అనుకూలమని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సమన్వయకర్త కుమారి, వ్యవసాయ సహాయకులు కతంబాల ఉష తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జెండా ఎగురవేయాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ముందురోజు ద్వేషం, హింస, మత ప్రాతిపదకన విభజించారని, ఇది ఎంతో బాధాకరమైన సంఘటనని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. బుధవారం జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఆ నాటి భయనక విభజన పరిస్థితులను డిస్‌ప్లే ద్వారా చూపిస్తూ పలు అంశాలు వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం తేవడానికి ఎంతో మంది మహానుభావులు కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ ఇంటిపై జెండాలు ఎగరవేయాలని కోరారు. హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా జెండాలను ఊపుతూ కూటమి నేతలతో కలిసి కలియ తిరిగారు. కార్యక్రమంలో సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనంద స్వామి, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్షణరావు, కూటమి నాయకులు లెంక శ్యాం, ప్రభ, అప్పలనాయుడు, దన్నాన సత్తిబాబు, లక్ష్మణరావు, మహేష్, అకెళ్ల సూరిబాబు, రాజేంద్ర, పోలీసు, వార్డెన్ రాము పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు


గ్రామాన్ని పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి

కొరగాంలో పారిశుధ్య పనులు

బూర్జ : మండలంలోని కొరగాంలో బుధవారం పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించారు. అలాగే నివాస ప్రాంతాల సమీపంలో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. చెత్తాచెదారాలతో దోమలు వ్యాప్తి చెంది తాగునీరు కలుషితం అవుతుందని, తద్వారా జ్వరాలు, వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. గ్రామస్తులు ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

నందిగాంను టెక్కలిలో ఉంచాలి

టెక్కలి: ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానంలో భాగంగా టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయం విభజనలో భాగంగా టెక్కలి నుంచి పలాస డివిజన్‌కు బదిలీ అయ్యింది. కానీ, నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పరిధిలో ఉంచాలని ఉపాధ్యాయులు సంఘ నాయకులు కోరుతున్నారు. ఇప్పటివరకు టెక్కలి డివిజన్‌లో తమల్ని పలాస డివిజన్‌కు బదిలీ చేయడంతో సాంకేతిక పరమైన ఇబ్బందులతో పాటు ఉపాధ్యాయులకు కార్యాలయం దూరమవుతుందన్నారు. ప్రతి చిన్న పనికీ పలాస వెళ్లాలంటే ఇబ్బందికర వాతావరణం నెలకుంటుందని అభిప్రాయపడుతున్నారు. నందిగాం మండలానికి టెక్కలి దగ్గరల్లో ఉన్న దృష్ట్యా విద్యాశాఖ కార్యాలయం పరిధి మాత్రం టెక్కలిలోనే ఉంచాలని కోరుతున్నారు.


సన్మానిస్తున్న టిడిపి నాయకులు

జీడి కార్మికుల సంఘ నాయకులకు సన్మానం

పలాస: జీడి కార్మికుల సంఘంలో కాష్యు, రైస్ మిల్లు లేబర్ యూనియన్ నూతన కార్యవర్గం అధ్యక్షునిగా అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శి సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాములు ఇటీవల ఎన్నికయ్యారు. వీరికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, నాయకులు గురువారం దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాసుమాన చంద్రమౌళి, కొరికాన శంకర్, యవ్వరి మోహనరావు, జగదీష్ పండా, దాస్, దేవుడు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన

పాతపట్నం : పేదవారికి పట్టెడన్నం పెట్టాలానే సంకల్పంతో టిడిపి కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్‌ను త్వరలో ఏర్పాటు చేస్తుందని టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జీ తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈయన వెంట సైలాడ సతీష్ తదితరులు ఉన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు